నగరవాసుల పల్లెబాట

- సంక్రాంతికి వెళ్లే ప్రయాణికులతో ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డు కిటకిట
- సరిపోని అదనపు బస్సులు
- రోడ్లపైనే జనం పడిగాపులు


ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో బస్సెక్కేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు


బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

మన్సూరాబాద్: సంక్రాంతి సెలవులు రావటంతో నగరవాసులు తమ సొంతూళ్ల బాటపట్టారు. పల్లె బాట పట్టిన పట్నం వాసులతో ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డు కిక్కిరిసి పోయింది. పాఠశాలలు, కాలేజీలకు పండుగ సెలవులు ఇవ్వడంతో తమ పిల్లలను తీసుకొని స్వగ్రామాలకు వెళ్లేందుకు వచ్చిన వారితో ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డు కిటకిటలాడుతోంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా తెలంగాణ ఆర్టీసీ అదనపు బస్సులను నడుపుతోంది. అయినా బస్సులు సరిపోకపోవడంతో ప్రయాణికులు రింగ్‌రోడ్డులో రోడ్డుపైనే బస్సుల కోసం పడిగాపులు కాస్తున్నారు.

ప్రయాణికులకు ఇబ్బందులు రాకుండా చర్యలు

ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని రెండు తెలుగు రాష్ట్రాల ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేసి హెల్ప్‌లైన్ సేవలందిస్తున్నారు. ప్రత్యేకంగా టెంట్లు వేసి ప్రయాణికులు కూర్చునేందుకు కూర్చీలు వేశారు. తాగునీటి వసతి, బయోటాయిలెట్లు ఏర్పాటు చేశారు. ప్రయాణికులు ఇబ్బందులు కల్గకుండా ప్రత్యేకంగా ఉన్నతాధికారిని నియమించి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ప్రైవేటు ఆపరేటర్ల దోపిడీ..

పల్లెబాట పట్టిన పట్నం వాసులు నగర శివారు ప్రాంతమైన ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డుకు భారీగా చేరుకుంటున్నారు. అంతేస్థాయిలో ఆర్టీసీ బస్సులు నడుపుతున్నా... ప్రైవేటు దోపిడీని అరికట్టలేకపోతున్నారు. ప్రయాణికుల నుంచి సాధారణ చార్జీలకన్న నాల్గు, ఐదు రెట్ల ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తున్నారు. రవాణా, పోలీస్ శాఖ అధికారులు చూసీ చూడనట్లు వదలేయడంతో ప్రైవేటు ఆపరేటర్ల దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది.

ప్రయాణికులకు సరైన సౌకర్యాలు లేవు: కొప్పుల

సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఎల్‌బీనగర్ కూడలి ఎల్‌పీటీ మార్కెట్ రహదారి వద్ద ప్రయాణికులకు సొరైన ఏర్పాట్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్న సమాచారం మేరకు మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి శుక్రవారం ఎల్‌బీనగర్ కూడలి ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ రహదారిపై సైకిలింగ్ ట్రాక్ పేరిట చేపట్టిన నిర్మాణాలతో రోడ్డు ఇరుకుగా మారి బస్సులు రోడ్డుపైనే నిలుస్తుండటంతో ప్రయాణికులు భయాందోళనలు చెందుతున్నారన్నారు. ఎల్‌బీనగర్ కూడలి వద్ద బస్‌షెల్టర్లు ఏర్పాటు చేసి, ప్రయాణికులకు వసతి కల్పించాలని పలుమార్లు కోరినా గత ప్రభుత్వం స్పందించలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు.

రద్దీకి అనుగుణంగా అదనపు సర్వీసులు..



ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను నడుపుతున్నాం. ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డు నుంచి సుమారు 150పైగా ప్రత్యేక బస్సులను నడిపాం. చివరి ప్రయాణికుడిని కూడా గమ్యస్థానానికి చేరవేసేందుకు ప్రయత్నిస్తున్నాం. నల్లగొండ, ఖమ్మం, విజయవాడ మూడు జోన్లను ఏర్పాటు చేసి అదనపు సిబ్బందిని నియమించి ఏర్పాట్లను పరిశీలిస్తున్నాం. ప్రయాణికులు ఏ రూట్‌వైపు ఎక్కువగా ఉంటే వెంటనే ప్రత్యేకంగా బస్సును ఏర్పాటు చేస్తున్నాం. కాలనీలవాసులు, బంధువులు మిత్రులు కలిసి బస్సు కావాలంటే ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తాం.

– శ్రీనివాసులు, కంట్రోలర్ ఇన్‌చార్జి, హైదరాబాద్

సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం


మారుతీనగర్‌లోని సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: డివిజన్‌లోని కాలనీల్లో నెలకున్న మౌలిక సమస్యలను పరిష్కరించి డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దటమే తన ప్రధాన లక్ష్యమని కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని మారుతీనగర్ కాలనీవాసుల ఫిర్యాదు మేరకు శుక్రవారం ఆయన సర్కిల్ అధికారులతో కలిసి కాలనీలో పాదయాత్ర నిర్వహించి గుంతలుగా మారిన కాలనీ అంతర్గత రహదారులు, లోప్రెజర్ తాగునీటి సరఫరా, తరలింపునకు నోచుకోని చెత్తకుప్పలను పరిశీలించారు. స్పందించిన ఆయన చెత్త కుప్పలను వెంటనే తరలించాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ...కాలనీలోని సమస్యలన్నింటినీ త్వరలో ప్రత్యేక నిధులు మంజూరు చేయించి పరిష్కరిస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్కిల్ ఏఈ సురేష్, సిబ్బంది రాజు, వాటర్ వర్క్స్ మేనేజర్ రమ్యభారతి, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు రమేష్, శ్రీనివాసరెడ్డి, నవీన్‌కుమార్, జనార్ధన్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, అనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పండుగల విశిష్టత తెలియజెప్పాలి


సంక్రాంతి సంబురాల్లో పాల్గొన్న నారాయణ స్కూల్ విద్యార్థులు

మలక్‌పేట: చిన్ననాటి నుంచే పిల్లలకు మన పండుగలు, పర్వదినాల విశిష్టత తెలియజెప్పాలని నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ ఈడీఎస్‌ఏ శాఖలో సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు. రైతులు, హరిదాసులు, జంగమయ్య వేషధారణలతో చూపరులను ఆకట్టుకున్నారు. విద్యార్థులకు సాంస్కృతిక, ముగ్గులు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జోన్ డీజీఎం హేమాంబర్, వైస్ ప్రిన్సిపాల్ రాధిక, ఏడీ శ్రీకాంత్, ఏఓ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పీజేఆర్ ఆశయ సాధనకు కృషి


పీజేఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి

చాదర్‌ఘాట్: కార్మిక నాయకుడు, మాజీ మంత్రి దివంగత పీజేఆర్ ఆశయ సాధనకు కృషి చేస్తామని ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. పి.జనార్ధనరెడ్డి 76వ జయంతి సందర్భంగా శుక్రవారం ఓల్డ్‌మలక్‌పేటలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, పేద, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం పీజేఆర్ ఎంతో కృషిచేసారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చౌకి రవికుమార్, వెంకటేశ్వరరెడ్డి, కృపాకర్ పాల్గొన్నారు.

ఆండాళ్ నిలయంలో వైభవంగా నిరాటోత్సవం


స్వామివారికి అభిషేకం చేస్తున్న పురోహితులు, ఆలయ నిర్వాహకులు

మలక్‌పేట: ధనుర్మాస తిరుప్పావై ప్రవచనోత్సవాల్లో భాగంగా శుక్రవారం మూసారంబాగ్ ఆండాళ్ నిలయంలో 'కుడారై వెల్లుంశీర్' నిరాటోత్సవాన్ని వైభవంగా జరిగింది. ఆలయ నిర్వాహకులు గోదారంగనాధులకు 108 వెండి గంగాళాములతో విశేష ప్రసాద నివేదన గావించారు. అనంతరం స్వామివారికి మంగళహారతులు సమర్పించారు. అప్పన్ కందాడై పెరుమాళ్ళాచార్యస్వామి గోదాదేవి వైభవంపై ప్రవచనం ఇచ్చారు. నిర్వాహకురాలు లక్ష్మీదేవి, రూపాదేవి, రామకృష్ణ, భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదానం చేసిన వారిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: రక్తదానం ప్రాణదానం లాంటిదని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాల్సిన అవసరం ఉందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ భూపేశ్‌గుప్తానగర్ కాలనీలోని నల్లపోచమ్మ ఆలయం ప్రాంగణంలో స్వామి వివేకానంద 161 జయంతి సందర్భంగా 'మీ కోసం మేమున్నాం' ఫౌండేషన్ చైర్మన్ నారగోని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, పేద మధ్య తరగతి ప్రజలను ఆదుకోవడంలో యువత ముందు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కందకట్ల శివకుమార్‌రెడ్డి, రమేష్‌బాబు, కందికంటి భరత్‌గౌడ్, మధుసాగర్, జలీల్, ఇబ్రహీం, శంకరయ్య, మనోజ్‌కుమార్, క్రాంతి కిరణ్ పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ కమిటీ ఎన్నిక

మీర్‌పేట: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ (టీఎస్‌యూటీఎఫ్) సంఘం బాలాపూర్ మండల నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు కరంటోత్ గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం మీర్‌పేట జిల్లెలగూడలోని ప్రభుత్వ పాఠశాలలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి.శంకరయ్య, ఉపాధ్యక్షులుగా ఈ.జోయల్, పి.నాగమణి, ప్రధాన కార్యదర్శిగా డి.ఆంజనేయులు, కోశాధికారిగా చెన్నప్పనాయుడు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు విద్యారంగంలో నెలకొన్న సమస్యలను నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించాలని తెలిపారు.

ప్రభుత్వ స్థలంలో నిర్మాణ సామగ్రి తొలగింపు

హయత్‌నగర్: ప్రభుత్వ స్థలంలో అక్రమంగా డంపింగ్ చేసిన భవన నిర్మాణ సామగ్రిని శుక్రవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... బాగ్ హయత్‌నగర్ సర్వే నెంబర్ 207లోని ప్రభుత్వ స్థలంలో ఇటుకలు, మట్టి, డస్ట్‌ను గుర్తు తెలియని వ్యక్తులు డంపింగ్ చేశారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది అక్రమ డంప్ చేసిన సామగ్రిని తొలగించారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ... ప్రభుత్వ స్థలంలో ఎలాంటి కార్యకలాపాలను అనుమతించమని, ఎవరైనా నిర్మాణాలు చేసేందుకు ప్రయత్నిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజానివాస్ ఫేజ్-2 ముగ్గుల పోటీలు


పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: సంక్రాంతి సందర్భంగా కొత్తపేట డివిజన్ ప్రజా నివాస్ ఫేజ్-2లో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. కాలనీ మహిళలు ఉత్సాహంగా పాల్గొని మనసును హత్తుకొనేలా అందమైన ముగ్గులు వేశారు. ముఖ్య అతిథిగా కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ హాజరయ్యారు. పోటీల్లో పాల్గొన్న వారికి శుభాకాంక్షలు తెలిపి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాహుల్ గౌడ్, కాలనీ అధ్యక్షుడు శంకర్‌రావు, కొత్త తిరుమల, వాసవి, విజయ కుమారి, మీనా, శరత్‌బాబు, సురేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రివర్గంలో మాదిగలకు సముచిత స్థానం కల్పించాలి

నాగోలు: జీహెచ్‌ఎంసీ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, రాష్ట్ర మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించాలని టీఎస్ ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు మేడి మహేష్ మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం టీఎస్ ఎమ్మార్పీఎస్ ఎల్‌బీనగర్ రింగ్ రోడ్డులో వంగపల్లి శ్రీనన్న నాయకత్వంలో ఈనెల 29న జరగబోయే మాదిగల పోరు సభ కరపత్రాలను విడుదల చేశారు. 29 న జరగబోయే మాదిగల పోరు సభను విజయవంతం చేయాలని కోరారు. ఎల్బీనగర్ అధ్యక్షుడు చిట్టెం అశోక్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించాలి


సెమినార్‌లో పాల్గొన్న విజయభారతి

నాగోలు: వికలాంగుల్లోని ప్రత్యేక నైపుణ్యాలను గుర్తించి, వారికి అన్ని రంగాల్లో సమాన అవకాశాలను కల్పించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సభ్యురాలు ఎస్. విజయభారతి అన్నారు. జాతీయ యువజన దినోత్సవం, స్వామి వివేకానంద 161వ జయంతి సందర్భంగా శుక్రవారం కొత్తపేటలోని మానస చిన్నారుల ఆరోగ్య వైకల్యాల అధ్యయన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వికలాంగులు తమ నైపుణ్యంతో రాణించేందుకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని కోరారు. వికలాంగులు చాలా అమాయకులు, నిజాయితీపరులు, గొప్ప మానవీయ గుణాలు కలిగి ఉంటారన్నారు. వారు ఎలాంటి వివక్షకు గురికాకుండా చూసేందుకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ అనేక చర్యలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ దాసరి శ్రీనివాసులు, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రో చైర్మన్ మల్కా కొమరయ్య, ప్రిన్సిపాల్ లక్ష్మి మాట్లాడారు.

ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించరాదు


ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

మలక్‌పేట: ప్రమాద రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగం చంద్రశేఖర్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మలక్‌పేట ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు 'ట్రాఫిక్ సేఫ్టీ నిబంధనల'పై అవగాహన కల్పించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ, రాంగ్ రూట్‌లో వెళ్లడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటివి చేయకూడదని, స్టాప్‌లైన్, జీబ్రా క్రాసింగ్ వద్ద ఆటోలు ఆపాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ అనుసరించాలని, అతి వేగం పనికిరాదని, పరిమితికి మించి ప్యాసింజర్లను కూర్చోపెట్టరాదన్నారు. లైసెన్స్ లేకుండా ఆటోలు నడుపరాదన్నారు.నిర్లక్ష్యం చేయకుండా లైసెన్సులు, డాక్యుమెంట్లు రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. లైసెన్స్ ఉన్న వారికి మాత్రమే ఇన్సూరెన్స్ క్లైమ్ చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్యాసింజర్లతో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. రూల్స్ అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సైలు రాము, రామస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల చేతిలో ఆయుధం సమాచార హక్కు చట్టం

టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం


మాట్లాడుతున్న ప్రొ. కోదండరాం.చిత్రంలో వర్రే వెంకటేశ్వర్లు, సత్యనారాయణ తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజల చేతిలో ఆయుధంగా ఉండే సమాచార హక్కు చట్టానికి తూట్లు పొడిచాయని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కొత్తపేటలోని బాబూ జగ్జీవన్ రామ్ భవనంలో సమాచారం హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కాచం సత్యనారాయణ గుప్తా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమాచార హక్కు వికాస సమితి 8వ రాష్ట్ర మహాసభ, కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి కోదండరాం, ఏపీ మాజీ ప్రధాన సమాచార కమిషనర్ వర్రే వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కోదండరాం మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు ఎంతో దోహద పడిందన్నారు. ప్రభుత్వంలో జరిగే పనులు, లోటుపాట్ల గురించి సమాచారం తెలుసుకునే హక్కు ప్రజలకు ఉంది అన్నారు. ఈ చట్టం ద్వారానే ప్రభుత్వంపై ప్రజలకు పట్టు పెరుగుతుందని తెలిపారు. అతి త్వరలో రాష్ట్ర సమాచార హక్కు కమిషన్‌ను నియమిస్తారని తెలిపారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారులు ఎండీ ఖలీల్, వివిధ జిల్లాల నుండి సమాచార వికాస సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతు బజార్లలో కూరగాయల ధరలు



దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 19, వంకాయ 28, బెండ 40, పచ్చిమిర్చి45, కాకర 45, బీర 38, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 18, క్యారెట్ 35, దొండ 28, ఆలు 23, ఉల్లి 24, గోకర 45, దోస 33, సొర 09, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 45, అర్వి 60, మునగ 65, చిలగడదుంప 50, బీట్‌రూట్ 21, కీర 15, ఫ్రెంచ్ బీన్స్ 40, కాప్సికమ్ 55. శనివారం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి చర్యలు

ఎల్‌బీనగర్: కాలనీల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు.డివిజన్‌లోని శ్రీ పురం కాలనీ, ఫేజ్– 2లో రోడ్లకు ఇరువైపులా చెట్ల కొమ్మలు ఇబ్బందికరంగా ఉన్నాయని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన గురువారం సంబంధిత సిబ్బందిని తీసుకెళ్లి చెట్ల కొమ్మలను తొలగింపజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి విఠల్‌రెడ్డి నాయకులు సికిందర్, నరసింహా రెడ్డి, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం స్వామి వివేకానందుడు


చంపాపేట మారుతీనగర్‌లో నివాళులర్పి స్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


మన్సూరాబాద్ సహారా వద్ద.. సామ రంగారెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి

ఎల్‌బీనగర్/మలక్‌పేట జోన్ల బృందం: స్వామి వివేకానంద 161వ జయంతిని శుక్రవారం ఎల్బీనగర్, మలక్‌పేట జోన్ల పరిధిలో ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలదండలు వేసి నివాళులర్పించారు. చంపాపేట డివిజన్ మారుతీనగర్‌లోని వివేకానందుడి విగ్రహానికి ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశ యువత వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

మన్సూరాబాద్‌లో....

మన్సూరాబాద్ సహారా ఎస్టేట్ సమీపంలో ఏర్పాటు చేసిన వివేకానందుడి జయంతి వేడుకలకు రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు సామ రంగారెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి హాజరై నివాళులర్పించారు. చంపాపేట,బీఎన్‌రెడ్డినగర్, గడ్డిఅన్నారంలో కార్పొరేటర్లు వంగ మధుసూదన్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి వివేకానందుడికి నివాళులర్పించారు.

మూసారంబాగ్‌లో...

మూసారంబాగ్ బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేశ్ హాజరయ్యారు.

సైదాబాద్‌లో.. వివేకానంద జయంతి సందర్భంగా ఎల్ఐసీ కాలనీలో జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. సైదాబాద్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి కాలనీలోని వివేకానంద విగ్రహానికి బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి నివాళులర్పించారు.

ఆస్మాన్‌ఘడ్‌లో...

ఆస్మాన్‌ఘడ్‌లోని వివేకానందుడి విగ్రహానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సరూర్‌నగర్‌లో...

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్‌లో వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు.

కుర్మగూడలో...

చంచల్‌గూడ: కుర్మగూడ డివిజన్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో వివేకానంద చిత్రపటానికి విద్యాభారతి సేవ ప్రముఖ్ విద్యాన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు.

జైపురి కాలనీలో...

నాగోలు: స్వామి వివేకనంద జయంతి సందర్భంగా జైపురికాలనీలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 3 కే వాక్, రన్ నిర్వహించారు. ఆర్గనైజర్ లక్ష్మణ్‌గౌడ్, ప్రమోద్‌గౌడ్, శంకర్, గోపి, గిరి యాదవ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.


మూసారంబాగ్‌లో.. నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి


సరూర్‌నగర్‌లో.. చిలుక ఉపేందర్‌రెడ్డి తదితరులు


బీఎన్‌రెడ్డినగర్.. నారాయణ పాఠశాలలో...


హస్తినాపురం..రేస్ ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో...

విద్యా సంస్థల్లో సంక్రాంతి సంబురాలు


శ్రీసరస్వతి పాఠశాలలో చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న ఉపాధ్యాయులు

హస్తినాపురం/చంపాపేట/ఎల్‌బీనగర్: ఎల్బీనగర్ జోన్ పరిధిలోని పలు విద్యా సంస్థల్లో శుక్రవారం సంక్రాంతి సంబురాలు జరుపుకున్నారు. విద్యార్థులు, అధ్యాపకులు సాంప్రదాయ దుస్తులు ధరించి పాల్గొన్నారు. కళాశాలలు, పాఠశాలల ఆవరణల్లో విద్యార్థినులు ముగ్గులు వేసి సందడి చేశారు. భోగి మంటలు వేశారు. పాలు పొంగించారు. చిన్నారులకు భోగి పండ్లు పోశారు. హరిదాసుల కీర్తనలు, డూడూ బసవన్నల విన్యాసాల నడుమ సంక్రాంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

- హస్తినాపురంలోని రేస్ ఉమెన్స్ కాలేజీలో సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ హరిణి గిరిధర్, కళాశాల ప్రిన్సిపాల్ నిహారిక, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- కర్మన్‌ఘాట్ శ్రీసరస్వతి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో విద్యావేత్త లెక్కల కృష్ణారెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ లలితారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ రంగారెడ్డి కాలనీలోని నారాయణ కాన్సెప్ట్ సీబీఎస్‌ఈ పాఠశాలలో జీఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ అనూసింగ్, వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణాలు, ఏఓ రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.